క్లుప్తంగా

నేడు కాకర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

మర్రిపూడి: మండలంలోని కాకర్ల గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరుకానున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు హాజరుకావాలని సూచించారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఈసీ వెంకటేశ్వర్లు బుధవారం సమీక్షించారు. గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని, పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలు పని ప్రదేశంలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఉండి ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలన్నారు. మస్టర్లలో అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

పేదలకు చీరల పంపిణీ

కందుకూరు అర్బన్: కందుకూరు డివిజన్ జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో పేద మహిళలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఆ సంస్థ కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఉలవపాడు: స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్రలు చదివించారు. వారం రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించి చివరిరోజు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

52 మంది పిల్లలకు ఒడుగులు

పామూరు: ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పామూరులో బుధవారం సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు షేక్.హాజీగౌస్, అధ్యక్షుడు షేక్.హుస్సేన్‌ల ఆధ్వర్యంలో 52 మందికి ఉచిత సున్తీ (ఒడుగులు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విరువూరురోడ్డులోని షాదీఖానాలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలు గ్రామాలకు చెందిన పిల్లలను సున్తీ కార్యక్రమానికి తీసుకువచ్చారు. డాక్టర్ పటాన్ మహబూబ్‌బాషాను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు షేక్.ఖాదర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్ చాంద్‌బాషా, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రషీద్, మండల అధ్యక్షుడు షేక్.సలీం, మండల ఖాజీ ఖాదర్‌బాషా, మండల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మునీర్ పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌తో అక్రమాలకు చెక్

పామూరు: ప్రభుత్వం నూతనంగా రూపొందించిన లోకోస్ యాప్‌తో పొదుపు గ్రూపుల్లో లావాదేవీల్లో అక్రమాలకు చెక్ పడనుందని ఏపీఎం రజనీకుమారి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండలంలోని వీఓఏలకు లోకోస్‌యాప్ డౌన్‌లోడ్, ఉపయోగించే విధానంపై మూడు రోజుల శిక్షణ ముగిసింది. ఏపీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు పలు యాప్‌లలో ఉన్న మహిళా సంఘాల సమాచారం ఇకపై దేశవ్యాప్తంగా ఒకే యాప్‌లో చూసేందుకు వీలవుతుందన్నారు. ప్రతి వీవోఏ సంఘం సభ్యుల వద్దకు వెళ్లి వారి వివరాలు, గ్రూప్‌ల వివరాలు సరిచూసుకుని నమోదు చేయాలన్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ దాడులు

హనుమంతునిపాడు: మండలంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం 16 గ్రామాల్లో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. మొత్తం 1011 విద్యుత్ సర్వీసులను పరిశీలించి 27 అక్రమ కనెక్షన్లను గుర్తించి కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,18,700 జరిమానా విధించినట్లు డీఈ ఎం నాగేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో ఏడీఈ ఆర్ ఉమాకాంత్, ఏఈ దినకర్‌బాబు, ఏఈలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- సింగరాయకొండ మండలంలో 3956 మందికి ఇళ్ల పట్టాలు
- 2,722 మందికి గృహాలు మంజూరు
- జగనన్న కాలనీలపై సమీక్షలో వరికూటి అశోక్‌బాబు



గృహ నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న అశోక్‌బాబు

సింగరాయకొండ: పేదల సొంతింటి కల నేరవేర్చడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. మండలంలో 3,956 ఇళ్లపట్టాలు ఇచ్చారని 2,722 ప్లాట్లలో గృహ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల మంజూరులో సింగరాయకొండ మండలం రాష్ట్రంలో రెండో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే ఆ లేఔట్‌లో ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి కుళాయిలు తదితర మౌలిక వసతులు కల్పిస్తుందని చెప్పారు. అంతేకాక ఆర్థిక భారంతో ఇళ్లు కట్టుకోలేని వారు ప్రభుత్వ సాయం కాకుండా అదనంగా రూ.60 వేలు లేదా రూ.లక్ష చెల్లిస్తే కాంట్రాక్టు పద్ధతిపై ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారన్నారు. లబ్ధిదారులకు డ్వాక్రా కింద రూ.35 వేలు, స్త్రీనిధి కింద రూ.50 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఐఐఎఫ్ఎల్ ప్రైవేటు బ్యాంకు వారు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా ఉంచుకుని 3 లక్షల రూపాయలు రుణంగా ఇస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు కందుకూరు రోడ్డు సెంటర్‌లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, తహసీల్దార్ సీహెచ్ ఉష, డీటీ తన్నీరు వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ కోట శ్రీహరి, ఎంపీటీసీ ఏపూరి శ్రీనివాసులు, జి.శ్రీహరిరెడ్డి, షేక్ సలీంబాషా, షేక్ పటేల్, పఠాన్ రియాజ్, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బొల్లావులతో ఘన స్వాగతం



కార్యక్రమానికి భారీగా హాజరైన అభిమానులు



బొల్లావులను ఎత్తుకుని నడుస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

కనిగిరి రూరల్: పీసీపల్లి మండలంలోని వెంగళాపురం లో గల పాలేటీ గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం కాటం రాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన నాయకులకు బొల్లావులు, కొమ్ములతో యాదవులు ఘన స్వాగతం పలికారు. రోడ్డుపై నుంచి గంగమ్మ తల్లి గుడి వరకు ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తి, ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్‌యాదవ్, కొలుసు పార్థసారథిలు బొల్లావుల ఉత్సవం, కొమ్ము ఊదుడులతో ముందుకు సాగారు. గంగమ్మ గుడిలో పూజల అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బొల్లావులను ఎత్తుకుని కాటం రాజు విగ్రహం వరకు నడిచారు. ర్యాలీలో యాదవులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, లక్ష్మీ దంపతులు అమ్మవారికి పొంగళ్లు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీలు మేకల శ్రీను, చప్పిడి సుబ్బయ్య, ఎంపీపీలు మూడ మంచు వెంకటేశ్వర్లు, జఘన్య, సతీష్ చౌదరి, గంగసాని హుస్సేన్ రెడ్డి, జీ బొర్రారెడ్డి, పెన్నా వెంకటేశ్వర్లు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఒకేరెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, రామన బోయిన శ్రీనివాసులు, దేవర వెంకటేశ్వర్లు, పి. మాలకొండయ్య, జీ బొర్రారెడ్డి, కొడిపిల్లి ఆంజనేయులు, ఏడుకొండలు, నాలీ వెంకటేశ్వర్లు, కత్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమంనిర్వహించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

హనుమంతునిపాడు: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం నగదు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ జన్మదినం సందర్భంగా 9 పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున 11 మందిని సన్మానించి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీలో ఎంఈఓ పెద్దిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్ఎస్ఏ సీఎంఓ కె. చిన్న వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ సూరి శెట్టి నారాయణస్వామి, హెచ్ఎంలు జీవీ సురేష్‌బాబు, కె.విజయలక్ష్మి, డి.భాస్కర్‌రెడ్డి, కస్తూరిబా ఎస్ఓ సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ

జగనన్న లే అవుట్ లబ్ధిదారులకు అవగాహన

లింగసముద్రం: లింగసముద్రం 1, 2, పెంట్రాల సచివాలయం పరిధిలోని జగనన్న లే అవుట్ లబ్ధిదారులకు ఎంపీడీవో శేషుబాబు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ లింగసముద్రం 1 సచివాలయం పరిధిలోని లే అవుట్‌లో 73 మందికి, సచివాలయం 2 పరిధిలో 153 మందికి, పెంట్రాల సచివాలయం పరిధిలో 69 మందికి ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోందని, పొదుపు గ్రూపు నుంచి వడ్డీ లేకుండా రూ.35 వేలు రుణంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. జగనన్న లే అవుట్లలో గృహాలను లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకోవచ్చన్నారు. ఇంత మంచి అవకాశం ఏ ప్రభుత్వం ఇవ్వలేదని, జగనన్న లే అవుట్లలో ఇచ్చిన ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి కాలనీలు రాలేదని, జగనన్న లే అవుట్లలో తమకు ప్లాట్లు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయంతో తాము కూడా సొంతింటిని నిర్మించుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి పెదరాఘవులు, ఏపీఎం సింహాద్రిరావు, పాల్గొన్నారు. చుండి గ్రామ సచివాలయం పరిధిలోని కాకర్లపాలెం గ్రామంలో 21 మందికి గృహాలు మంజూరైనట్లు హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కాకర్లపాలెంలోని జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చుండి గ్రామ సర్పంచ్ ఇరుపని సతీష్, ఎంపీడీవో షేక్ రఫీక్‌అహ్మద్, ఎంపీటీసీ చౌడబోయిన యానాది, పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు శాశ్వత భూహక్కు ఘనత సీఎం జగన్‌దే..



శివరాయునిపేటలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

మర్రిపూడి: భూముల సర్వే సుమారు 115 ఏళ్ల క్రితం చేపట్టారని, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత భూములను రీసర్వే చేసి రైతులకు శాశ్వత హక్కు కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకర్ల సచివాలయం పరిధిలో శివరాయునిపేట గ్రామంలో బుధవారం వరికూటి అశోక్‌బాబు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం సర్వేను వరికూటి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. 1908లో బ్రిటిష్ హయాంలో భూమిని సర్వే చేశారన్నారు. 115 ఏళ్ల తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. తద్వారా రైతుల్లో మనోధైర్యాన్ని నింపారన్నారు. రైతులు తమ భూమి పత్రాల నకళ్లను సర్వే సమయంలో రెవెన్యూ అధికారులకు అందజేయాలని సూచించారు. కాకర్ల పరిధిలో సుమారు 6800 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉందన్నారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు మొలల్ల శివరామిరెడ్డి, సర్పంచ్ శివన్నారాయణ, నాయకులు దొద్దాలి మల్లికార్జునరావు, వనిపెంట మల్లికార్జురెడ్డి, అలికేపల్లి వెంకటరెడ్డి, పూనూరి సంజీవరెడ్డి, మొల్లల వెంగల్‌రెడ్డి, మొల్లల రామిరెడ్డి, కాశయ్య, ఎస్‌కే సిలార్, ఎ.బాలరాజు, పి.నరేష్, జి.రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రంలో సుపరిపాలన

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



ఎమ్మెల్యే బుర్రాను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ సతీష్ చౌదరి

పీసీపల్లి,(కనిగిరి రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలంలోని పాలేటి గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఎమ్మెల్యే బుర్రా మాట్లాడారు. టీడీపీ పాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏం లేదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. గంగమ్మ తల్లి ఆశీస్సులు, దీవెనలతో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తొలుత వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్ చౌదరి ఎమ్మెల్యే బుర్రాకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జఘన్య, జెడ్పీటీసీ లక్ష్మీకాంతంరెడ్డి, చప్పిడి సుబ్బయ్య, మేకల శ్రీను, డాక్టర్ పెరుగు మురళీకృష్ణా, ఖాదర్ బాష, ఎంపీపీ మూడ మంచు వెంకటేశ్వర్లు, జి.బొర్రారెడ్డి, ఒకేరెడ్డి, గంగసాని హుసేన్‌రెడ్డి, పోలు జయరాంరెడ్డి, మేకల మాల్యాద్రి, పరిమి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించి రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఉదయం ఆయన తనిఖీ చేశారు. వరికూటి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఓపీల సంఖ్య పెంచాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాధ్యత అని కాకుండా మానవత్వంతో పనిచేయాలని చెప్పారు. నైట్ వాచ్‌మన్ నియామకానికి ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులును పిలిపించి వారానికి ఒకరోజు ఆస్పత్రి ఆవరణ మొత్తం శుభ్రం చేయించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మికి ఫోన్ చేసి వచ్చేవారం ఆస్పత్రిలో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది సమస్యల పరిష్కారానికి, ఆసుపత్రిలో అదనపు వసతుల కల్పనకు కృషి చేద్దామని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ చైతన్యకృష్ణ మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలో సుగర్, కిడ్నీ, థైరాయిడ్, మలేరియా, క్షయ, కొలెస్ట్రాల్, పసికర్లు వంటి క్లినికల్ పరీక్షలు కూడా చేస్తున్నామని వివరించారు. డాక్టర్లు ఎస్.వంశీధర్, కె.ధీరేంద్రకుమార్, ఉజ్వల, వైఎస్సార్ సీపీ నాయకులు జి శ్రీహరిరెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంభాషా, షేక్ ఆబిద్‌అలీ, రాజు వెంకటేశ్వరరెడ్డి, షేక్ రియాజ్, చుక్కా అశోక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థులకు కాల్ లెటర్స్

వెలిగండ్ల: వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెలిగండ్ల, హనుమంతునిపాడు, సీఎస్‌పురం మండలాల్లో మొత్తం 4 అంగన్‌వాడీ ఆయాపోస్టులు ఖాళీగా ఉండగా వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 13 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి తెలిపారు. ఒంగోలు ప్రకాశం భవన్‌లో జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఈనెల 11న ఉదయం 8:30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సూపర్‌వైజర్ పార్వతి, ప్రాజెక్టు అసిస్టెంట్ జి.సామ్యూల్ ఇంటర్వ్యూ కాల్‌లెటర్స్ అందజేశారు.

పొగాకు కనిష్ట ధర రూ.163

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం పొందూరు గ్రామానికి చెందిన రైతులు 921 బేళ్లు తీసుకురాగా 882 కొనుగోలయ్యాయి. 39 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.163, సరాసరి ధర రూ.198.26 పలికింది. వేలంలో 21 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కందుకూరు : కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన వేలంలో మొత్తం 1,252 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఒకటో వేలం కేంద్రంలో 629 బేళ్లు విక్రయానికి ఉంచగా, 596 బేళ్లు కొనుగోలు చేశారు. రెండో వేలం కేంద్రంలో 713 బేళ్లకు గానూ 656 బేళ్లను కొనుగోలు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి..

ఎట్టకేలకు పోస్టుమార్టం



కోటయ్య సమాధిని తవ్విస్తున్న అధికారులు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ అనచెరువులో గత నెల 8వ తేదీ రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాముల కోటయ్య(55) మృతదేహానికి ఈనెల 8వ తేదీన పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా కొండాపురం మండలం సాయిపేటలో అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా మంగళవారం రాత్రి తెలిపారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఇరిగేషన్‌శాఖకు చెందిన అనచెరువులో వీఆర్ఏ, అతని కుమారుడు అనధికారికంగా చేపలు పట్టేందుకు కోటయ్య, ఆయన కుమారుడు ప్రసాద్, మరి కొంతమందిని తీసుకొచ్చారు. ఈ క్రమంలో కోటయ్య కాలికి వల చుట్టుకోవడంతో నీటిలో పడిపోయి ఊపిరాడక మరణించాడు. కోటయ్య మృతిని గోప్యంగా ఉంచిన వీఆర్ఏ.. రాత్రికి రాత్రి మృతదేహాన్ని రహస్యంగా సాయిపేటకు తరలించాడు. ఈ విషయం బయటకు పొక్కడంతో గత నెల 17వ తేదీన వీఆర్‌ఓ తిరుమల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే కోటయ్య కాలికి వల చుట్టుకుని మరణించాడని వీఆర్‌ఓ తన ఫిర్యాదులో పేర్కొనగా, కోటయ్య భార్య కోటేశ్వరమ్మ మాత్రం గుండెపోటుతో మరణించాడని తహసీల్దార్ సీహెచ్ ఉషకు వాంగ్మూలం ఇచ్చింది.

వేర్వేరు వాంగ్మూలాల నేపథ్యంలో సోమవారం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దత్తు ప్రసాద్ ఆధ్వర్యంలో కొండాపురం మండల ఇన్‌చార్జి తహసీల్దార్ కోటేశ్వరరావు, సింగరాయకొండ ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు.